

బోథ్ బస్టాండ్ పరిశీలన

బోథ్: బోథ్ బస్టాండ్‌ను నిర్మల్ ఆర్టీసీ డీఎం పండరి సోమవారం పరిశీలించారు. ప్రహరీ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ ఉన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం : 6:24	బుధవారం : 4:59

గరిష్టం/కనిష్టం
38.4/22.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత పెరుగుతుంది. అర్ధరాత్రి తర్వాత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

కైలాస్‌నగర్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బి.తిరుమల ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31తో గడువు ముగియనుండగా మరో మూడు నెలలు పొడిగించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈనెల 25న సాయంత్రం 4 గంటల నుంచి తమ కార్యాలయంలో సంప్రదించి అక్రిడిటేషన్ కార్డుపై స్టిక్కర్లు వేయించుకోవాలని కోరారు.

టీబీ రహిత సమాజానికి కృషిచేయాలి



ప్రదర్శనలను తిలకిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: టీబీ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్‌లోని ఆడిటోరియంలో ప్రపంచ టీబీ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య విద్యార్థులకు టీబీ వ్యాప్తి, ప్రభుత్వం తీసుకుంటున్న నివారణ చర్యలు, చికిత్స విధానాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. మెడికోలకు రంగోళి, పెయింటింగ్, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 2030 నాటికి దేశంలో టీబీని నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో టీబీ ఎక్కువగా ఉందని, అవగాహన రాహిత్యంతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. టీబీపై వంద రోజుల అవగాహన కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, మెడికోలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువకుల నుంచి రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజలింగు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్నవారు ఏప్రిల్ 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పేరుకుపోయిన చెత్త నిల్వలు

డీఆర్‌సీసీలో సెగ్రిగేషన్ చేస్తున్న కార్మికులు

చెత్తను ఎరువుగా మార్చే యంత్రం



అలంకారప్రాయంగా కంపోస్టు ఎరువు తయారీ బెడ్‌లు

మొక్కుబడిగా చెత్తశుద్ధి

- కలివిడిగానే తడి, పొడి చెత్త సేకరణ
- బయోమైనింగ్ చేపడుతున్నా..
- గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- అటకెక్కిన వర్మీ కంపోస్టు తయారీ
- సెగ్రిగేషన్ చేస్తున్నా.. నయాపైసా రాని ఆదాయం

పట్టణంలోని వార్డులు: 49
కుటుంబాలు: 48,393
ప్రతీరోజు పోగయ్యే చెత్త: 64 మెట్రిక్ టన్నులు
తడి చెత్త: 22 మెట్రిక్ టన్నులు
పొడి చెత్త: 42 మెట్రిక్ టన్నులు
చెత్తను తరలించే వాహనాలు: 13 ట్రాక్టర్లు, 47 ట్రాలీఆటోలు

కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. చెత్తను వేరు చేసి సేకరించాల్సి ఉండగా బల్దియా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలనే ఉద్దేశంతో ఇంటింటికి రెండు బుట్టలు అందజేశారు. అయినా ప్రజలు అవగాహన రాహిత్యంతో తమ ఇళ్లల్లో పోగైన చెత్తను ఇష్టారాజ్యంగా జమచేసి అందజేస్తున్నారు. అలాగే డంపింగ్‌యార్డుకు తరలించేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసేందుకు ప్రత్యేక కేంద్రాన్ని నిర్మించిన వీటి తయారీ జరగడం లేదు. చెత్తలో వచ్చే అట్టలు, ప్లాస్టిక్, గాజులు వంటి వస్తువులను వేరుచేసి విక్రయించే బాధ్యతలను మహిళ సమాఖ్యకు అప్పగించారు. ప్రతీనెలా రూ.లక్ష ఆదాయం సమకూరుతున్న బల్దియాకు నయాపైసా ప్రయోజనం ఉండటం లేదు.

36 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్‌యార్డు

పట్టణంలో పోగయ్యే చెత్తను నిల్వ చేసేందుకు 4వ వార్డు బంగారుగూడలో 36 ఎకరాల విస్తీర్ణంలో భారీ డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. దాని చుట్టూ ప్రహరీ నిర్మించడంతోపాటు వివిధ రకాల మొక్కలు నాటారు. మొత్తం 49 వార్డుల్లో నిత్యం 64 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా దాన్ని ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల ద్వారా తరలిస్తూ నిల్వ చేస్తున్నారు. చెత్తను సేకరిస్తున్నా కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. డంపింగ్‌యార్డులో గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నాయి. గాజులు, ప్లాస్టిక్, అట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాగితాలు, రబ్బర్, మెటల్ వంటి 14 రకాల వస్తువులను వేరు చేసేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో డ్రైరిసోర్సు కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ)ని నిర్మించారు. చెత్త సెగ్రిగేషన్ బాధ్యతలను పట్టణంలోని ఓ మహిళ సమాఖ్యకు అప్పగించారు. ప్రత్యేక సిబ్బంది ద్వారా సెగ్రిగేషన్ చేస్తూ ఆ సమాఖ్య ఆ వస్తువులను మార్కెట్‌లో విక్రయిస్తోంది. దీనిద్వారా నెలకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. ఆ డబ్బులు వినియోగిస్తుండటంతో బల్దియాకు రూపాయి రావడం లేదు. అలాగే ఈ సెంటర్‌కు వచ్చే ప్లాస్టిక్ బాటిళ్లను ముద్దలా మార్చేందుకు లక్షలాది రూపాయలతో ప్రత్యేక యంత్రాన్ని కొనుగోలు చేసి డీఆర్‌సీసీలో అమర్చారు. అది ఏర్పాటుకే పరిమితమైంది తప్ప ప్రారంభానికి నోచుకోకుండానే చెడిపోయింది. దీంతో ప్రజాధనం వృథా అయిందే తప్ప ప్రయోజనం చేకూరడం లేదు.

బయో మైనింగ్..

రెండేళ్లక్రితం వరకు పోగైన 1.16 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. ఇందుకోసం ఇటీవల ఆ సంస్థకు రూ.1.16 కోట్ల నిధులు అందజేశారు. గత రెండేళ్ల నుంచి ఈ కంపెనీ చెత్తను ఎరువుగా మారుస్తోంది. ఇందుకోసం రెండు యంత్రాలు ఏర్పాటు చేయగా అందులో ఒకటి మాత్రమే పనిచేస్తోంది. మరోటి మూలకు చేరింది. ఓ వైపు పాత చెత్త కుప్పలను బయోమైనింగ్ చేపడుతుండగా మరోవైపు గతేడాది నుంచి పోగవుతున్న చెత్తను మాత్రం ముట్టడం లేదు. దీంతో చెత్తకుప్పలు గుట్టలుగా మారుతున్నాయి. ప్రస్తుతం 60 వేల మెట్రిక్ టన్నుల చెత్తకుప్పలు నిల్వ ఉన్నట్లుగా బల్దియా అధికారులు చెబుతున్నారు, పాతవి పూర్తయిన తర్వాత కొత్త కుప్పలను బయో మైనింగ్ చేసే బాధ్యతలను అప్పగించనున్నట్లుగా వెల్లడించారు.

నిర్మించి ఐదేళ్లయినా..

తడి, పొడి చెత్తను వేరు చేయడంతోపాటు వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలనే ఉద్దేశంతో డంపింగ్‌యార్డులో ప్రత్యేక కేంద్రాన్ని నిర్మించారు. ఎరువుల తయారీకి వీలుగా బెడ్‌లు సిద్ధం చేయడంతోపాటు ఐదుగురు కార్మికులను నియమించారు. అయితే ఎరువుల తయారీ మాత్రం ఇక్కడ జరగడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైన అక్కడకు సందర్శనకు వస్తే ఏదో చేస్తున్నామని చెప్పేందుకన్నట్లుగా రెండు బెడ్‌ల్లో తునికా ఆకు కట్టలు నింపి, మరో దాంట్లో కుళ్లిపోయిన కొన్ని కూరగాయలను పడేసి ఉంచుతున్నారు. కంపోస్టు ఎరువు తయారీ కేంద్రాన్ని నిర్మించి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కిలో ఎరువు తయారు కాలేదంటే అక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది పట్టింపు లేనితనమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఎరోడ్రమ్‌లో చెత్తకుప్పలు

బల్దియాకు భారీ డంపింగ్‌యార్డు ఉన్నప్పటికి కొంతమంది సిబ్బంది చెత్తను అక్కడకు తరలించకుండా ఏరోడ్రమ్ మైదానంలో పడేస్తున్నారు. ట్రాలీల ద్వారా తీసుకువచ్చి పడేస్తుండటంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. వాటికి కాలనీవాసులు నిప్పటించడంతో పొగ వ్యాపించి ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిపై బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన కల్పిస్తాం



బల్దియా తరపున ప్రతీ ఇంటికి రెండు బుట్టలు అందించాం. చెత్తను ఇష్టారాజ్యంగా పోగు చేసి వాహనాలకు అందజేస్తున్నారు. దాన్ని అలాగే డంప్‌యార్డుకు తరలిస్తున్నాం. చెత్తను వేర్వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. బల్దియా సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించిన తర్వాతే సేంద్రియ ఎరువులను తయారు చేసేలా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం.

– సీవీఎన్. రాజు, మున్సిపల్ కమిషనర్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



నిరసనలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎదుట బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ మాట్లాడుతూ రైతులు పడ్డ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తే తమను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. రైతులందరికీ న్యాయం చేసేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా పట్టణంలోని కొమరం భీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అసెంబ్లీలో మాట్లాడారు. నిరసనలో ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్ పాల్గొన్నారు.

నీటి వనరుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపండి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్‌గా ఎంపిక చేసిన నార్నూర్ మండలంలో నీటి వనరుల పునరుద్ధరణకు అవసరమై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ యుగల్ జోషి సూచించారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి నీటి వనరుల పునరుజ్జీవనం అమలుపై గుర్తించబడ్డ ఆకాంక్షాత్మక బ్లాక్‌ల జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. చెరువుల్లో పూడికతీతతో నీటినిల్వలు పెరిగి, భూగర్భజలాల అభివృద్ధితోపాటు చెరువుల పరిధిలోని ఆయకట్టు సాగుకు నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ దిశగా ఆకాంక్షాత్మక బ్లాకులల్లో ఏటీఈ చంద్ర ఫౌండేషన్ సాయంతో నీటి వనరుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టనుందన్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యల ని'వేదన'



సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్‌లతో కలిసి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అయా దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ఈ వారం మొత్తం 99 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే..

కోర్టు తీర్పుఇచ్చినా పనులు ఆపడం లేదు



ఇళ్లమధ్యలో, కిడ్స్ బడిని ఆనుకుని మా కాలనీలో సెల్‌టవర్ నిర్మిస్తున్నారు. దీన్ని నిలిపివేసేలా చూడాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. కంపెనీ ప్రతినిధులు పనులు చేపడుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో తాము కోర్టుకెళ్లి ఆర్డర్ తెచ్చినా పనులు ఆగడం లేదు. నిరసన తెలిపితే పోలీసులు బెదిరిస్తున్నారు. కోర్టు ఆదేశాలకనుగుణంగా పనులు నిలిపివేసేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

– జుబ్లీహిల్స్ కాలనీవాసులు, ఆదిలాబాద్

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి



యాసంగి సీజన్‌కుగాను మా గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాల్లో జొన్న సాగు చేశాం. ఏప్రిల్ 15 నాటికి పంట చేతికందే అవకాశముంది. అప్పటిలోగా జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి. గతేడాది ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం 12 క్వింటాళ్లు కొనడంతో చాలా మంది ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోయారు. ఈ యేడు ఎకరాకు 20 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– కజ్జర్ల రైతులు, తలమడుగు

టీచర్ల సస్పెన్షన్ ఎత్తివేయాలి



మోడల్ స్కూల్‌లో ముగ్గురు టీచర్లు విద్యార్థులను వేధింపులకు గురిచేసినట్లుగా జరిగిన ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. వైరల్‌గా మారిన సదరు టీచర్లు, తమ పిల్లలతో కూడిన ఫొటోలపై తామెలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. వారంటే గిట్టని టీచర్లు వాటిని వైరల్ చేసి మీకు ఫిర్యాదు చేశారు. వారి సస్పెన్షన్‌తో విద్యార్థులు మానసికంగా బాధపడుతున్నారు. పునర్విచారణ జరిపించి సస్పెన్షన్ ఎత్తివేయాలి.

– విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బజార్‌హత్నూర్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్సైలు, సీఐ, డీఎస్పీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌ఓలు, పోలీసులు ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. కోర్టు మానిటరింగ్ పద్ధతులను సమీక్షించి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. సిబ్బందికి వీక్లీ ఆఫ్ వచ్చేవిధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. అధికారులు సిబ్బందికి ఏవైన సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ఎస్సైలు, సీఐలు తమ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, సైబర్‌క్రైమ్, మూఢనమ్మకాలు, డయల్ 100 గురించి అవగాహన కల్పించాలన్నారు. షీటీమ్ బృందం ప్రతీ గ్రామాన్ని సందర్శించారు. అంతకుముందు సీసీ టీవీలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. వ్యభిచారం, గంజాయి, మట్కా, పేకాట, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీలు శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సిహెచ్ నాగేందర్, సీఐలు, ఎస్సైలు, ఎస్‌హెచ్‌ఓలు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతా సైలెంట్

- జిల్లా కాంగ్రెస్‌ను చక్కదిద్దే చర్యలేవి?
- ప్రత్యేక కమిటీ ఊసే లేదు
- కార్యకర్తల్లో నైరాశ్యం
- ఇలాగైతే స్థానిక ఎన్నికల్లో పట్టుదొరికేదెలా..

సాక్షి,ఆదిలాబాద్: మూడు వారాల కిందట అంటే.. మార్చి 4న హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో జిల్లాలోని ముఖ్య నేతలు, నాయకులు పాల్గొన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగింటిలో బీజేపీ, రెండింటిలో బీఆర్‌ఎస్, కేవలం ఖానాపూర్ నియోజకవర్గంలోనే పార్టీ అధికారంలో ఉందని, కాంగ్రెస్ కార్యకర్తలకు ఇప్పటివరకు సంపూర్ణంగా న్యాయం దక్కడం లేదని పలువురు నాయకులు అధిష్టానం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలో పార్టీని చక్కదిద్దేందుకు ప్రత్యేక కమిటీలు వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ప్రకటించారు. ఈ నిర్ణయం తీసుకుని 20 రోజులు దాటినా ప్రత్యేక కమిటీ నియమించలేదు. ఇక్కడి పార్టీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు.

కార్యకర్తల్లో నిరుత్సాహం..

ఆరోజు అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో సంతోషపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో నిరుత్సాహం కనిపిస్తోంది. దీంతో ఈ పార్లమెంట్ పరిధిలో, జిల్లా స్థాయిలో పార్టీ అంతగా ప్రాధాన్యత నివ్వడం లేదా అన్న మీమాంస వారిలో వ్యక్తమవుతోంది. ప్రధానంగా జిల్లాకు సంబంధించి గత రెండేళ్లుగా జిల్లా అధ్యక్షుడు లేకపోవడం, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే నాయకుడు కరువయ్యాడన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల్లో పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పెద్దగా ఎవరికి ప్రాధాన్యత కల్పించలేదన్న అసంతృప్తి కనిపిస్తోంది. అధిష్టానం ప్రత్యేక కమిటీ నియమించి పార్టీ పరిస్థితులను చక్కదిద్దుతుందా..లేదా అని కార్యకర్తలు ఎదురుచూసే పరిస్థితి ఉంది.

స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేదెలా..

జిల్లాలో దిశానిర్దేశం చేసే నాయకుడు లేకపోవడంతో పార్టీ చుక్కానిలేని నావలా తయారైంది. నియోజకవర్గ ఇన్‌చార్జిలను నమ్ముకుని పార్టీ కార్యకర్తలు ముందుకెళ్తున్నారు. సరిగ్గా ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడిని ప్రకటించే కంటే ముందుగా నిర్ణయం తీసుకుంటే పార్టీపరంగా కార్యకర్తలకు సముచితంగా ఉంటుందన్న అభిప్రాయం వారి నుంచి వ్యక్తమవుతోంది. స్థానిక ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడి పాత్ర క్రియాశీలకమవుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ ఇప్పటికైనా సైలెంట్ ధోరణిని వీడి పరిస్థితిని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం కార్యకర్తల నుంచి వ్యక్తమవుతోంది. ప్రధానంగా పార్టీ అధికారంలో ఉందని చెప్పుకోవడమే తప్ప ఇప్పటివరకు కార్యకర్తగా తమకు సరైన ప్రాధాన్యత లభించలేదన్న నిరుత్సాహం వారిలో కనిపిస్తోంది. నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండటం, ఇటు జిల్లా స్థాయిలో పట్టు ఉన్న నేతలు లేకపోవడంతో తమకు కనీసం పనుల కేటాయింపుల్లో వివక్ష ఎదురవుతుందని వాపోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో వివిధ గ్రాంట్లతో పనుల కేటాయింపు జరిగినప్పటికీ పార్టీ కార్యకర్తలకు పనులు దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

నార్నూర్: పీఎం అవార్డ్స్–2024 కోసం దేశ వ్యాప్తంగా 426 ఆస్పిరేషనల్ బ్లాక్‌లో టాప్–30లో నార్నూర్ ఎంపికైంది. మంగళవారం నార్నూర్‌లో కేంద్ర బృందం పర్యటించనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డిలు మండలంలోని జామ్‌డా, గుంజాల, నాగల్‌కొండ గ్రామాల్లో పర్యటించారు. బాలికల ఆశ్రమ, ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయించారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద భవిష్యత్తు మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని డీఆర్‌డీవో అన్నారు. ఎంపీడీవో జవహర్‌లాల్, తహసీల్దార్ రాజలింగు, డీపీఎం నరేందర్ బాదావత్, సీడీపీవో శారద తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో మాట్లాడారు. జనరల్ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు 70 కి.మీ దూరం వెళ్లి చదువుకోవాల్సి వస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో రూ.10.50 కోట్లతో సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు చేపట్టగా ప్రస్తుతం కొనసాగుతుందన్నారు. దీంతో రూ.18 కోట్లతో వంద పడకల ఆసుపత్రిగా మారుస్తూ జీవో ఇచ్చామన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు జీవోను అమలు చేయడం లేదన్నారు. వెంటనేటెండర్ల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన సొనాల, సిరికొండ, భీంపూర్ మండలాల్లో నూతన భవనాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు.

లింగన్న కుటుంబాన్ని ఆదుకోవాలి

పంట ఎండిపోయిన బాధతో ఈనెల 21న ఆత్మహత్య చేసుకున్న తలమడుగు మండలం సుంకిడికి చెందిన రైతు కుమ్మరి లింగన్న కుటుంబాన్ని ఆదుకోవాలని అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. నీరు లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో బోథ్‌ను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తలమడుగు మండలం టోకిగూడను పంచాయతీగా చేయాలని కోరారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి


ప్రమోద్ మృతదేహం

బాసర: బాసర ఆలయానికి వెళ్లే మూల మలుపు రెండో ఆర్చి గేట్ వద్ద సోమవారం ప్రమాదం జరిగింది. సరస్వతీ ఆలయం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో బాసర విద్యుత్ సబ్‌ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ ప్రమోద్ డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై గణేశ్ పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ – దిలావార్‌పూర్ మార్గంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఖానాపూర్ పట్టణానికి చెందిన మజహర్ సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనంపై వెళ్తుండగా మేకల సుధీర్ అతడిని ఆపి తనిఖీ చేసి ఫొటోలు తీశారన్నారు. దీంతో మజహర్ పోలీసులు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు


దుప్పిని కాపాడిన యువకులు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ పరిసరాల్లోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు సోమవారం దాడి చేశాయి. జనావాసాల్లోకి వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడించాయి. స్థానిక యువకులు గమనించి కాపాడాచి కాపాడారు. యువకులు స్వాములు రాకేశ్, విష్ణు, ప్రశాంత్, అంజి దానిని అటవీ సిబ్బందికి అప్పగించారు.

సులభంగా కొత్త విద్యుత్ కనెక్షన్లు

నిర్మల్‌చైన్‌గేట్:వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ కనెక్షన్లను సులభంగా మంజూరు చేస్తున్నామని విద్యుత్ శాఖ నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.సుదర్శనం తెలిపారు. వినియోగదారునికి కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణంతో దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారుడు తగు విధంగా స్పందించడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివిధ కారణాలతో డిపార్ట్‌మెంట్ రూల్‌కు లోబడి కొత్త సర్వీసులు ఆలస్యం కాకుండా దరఖాస్తుదారుడికి మెసేజ్ రూపకంగా ప్రతి దశలో వెళ్తుందన్నారు. అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి కొత్తగా ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించామని తెలిపారు. అప్లికేషన్ నంబర్‌తో టీజీ ఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి లేదా టీజీ ఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా వివిధ దశల్లో ఉన్న అప్లికేషన్ స్థితిని తెలుసుకోచ్చని వివరించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు


ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నామని, జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రారంభించారు. అనంతరం క్షయ నివారణకు ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు ముందుకు రావాలని, నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా ప్రోగ్రాం అధికారి సురేందర్, డీపీఎం ప్రశాంతి, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పద్మ, డెమో బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టాళ్ల నిర్మాణం... బల్దియాకు ఆదాయం

- ప్రభుత్వ, సింగరేణి ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారాలు
- స్టాళ్లు నిర్మించి అద్దెకు ఇస్తే మున్సిపాలిటీకి వనరులు


చాడేశ్వరి ముందు రోడ్డుపక్కన ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ, సింగరేణి ఖాళీ స్థలాలకు కొదువలేదు. అంతర్గత ప్రధాన రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. నిరుపేదలు, నిరుద్యోగులు, సింగరేణి రిటైర్డు కార్మికులు తోపుడు బండ్లపై, తాత్కాలికంగా చిన్నపాటి షెడ్లను ఏర్పాటు చేసుకుని పండ్లు, కూరగాయలు, మటన్, చికెన్, ఇతర రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. చిరు వ్యాపారం పేద కుటుంబాలకు జీవనాధారంగా మారగా శాశ్వత ప్రాతిపదికన నిర్వహించే అవకాశాలు లేకుండా ఉన్నాయి. మున్సిపాలిటీ పరంగా స్టాళ్లను నిర్మించి చిరు వ్యాపారులకు కేటాయిస్తే జీవనోపాధి కల్పించడంతో పాటు బల్దియాకు ఆదాయ వనరులు సమకూరే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఆదిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా చేస్తే ఉపయోగం

మున్సిపాలిటీలోని స్టేషన్ రోడ్‌కాలనీ (చమ్రీస్ క్వార్టర్స్) అంతర్గత ప్రధాన రహదారి పక్కన చాడేశ్వరి ముందు, కోర్టు ఎదుట ఉన్న ఖాళీ స్థలాల్లో ప్రస్తుతం తోపుడు బండ్లు, షెడ్ల ఆధారంగా ప్రజావసరాలకు అనుగుణంగా మటన్, చికెన్, కట్టెలు, పండ్లు ఇతర రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మున్సిపాలిటీ పరంగా స్టాళ్లను నిర్మించడం వల్ల చిరు వ్యాపారులకు లబ్ధిచేకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

- ఏరియాలకు అనుగుణంగా అందుబాటులో స్టాళ్లను నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల వాసులకు నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి సౌలభ్యంగా ఉంటుంది. బజారు ఏరియా ప్రాంతానికి రావడానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం కలిసి వస్తుంది. కాలినడకన వెళ్లి సునాయాసంగా కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుంది.
- మున్సిపాలిటీలో నివసిస్తున్న యువతకు స్వయం ఉపాధి లభించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు నివారించడానికి అవకాశాలు ఉంటాయి.
- రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల్లో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఉండడంతో పాటు పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుంది.
- స్టాళ్ల ఏర్పాటు వల్ల మున్సిపాలిటీకి స్థిరమైన ఆదాయం వస్తుంది. తద్వారా సిబ్బందికి వేతనాలు చెల్లించడానికి ఆర్థికభారం నుంచి కాస్త ఉపశమనం కలుగుతుంది.
- స్టాళ్లను నిర్మించడం వల్ల సాధ్యమైనంత వరకు ఖాళీ స్థలాలు దురాక్రమణకు గురి కాకుండా ఉంటాయి. ప్రజావసరాలకు దోహద పడతాయి.

రెండు చోట్ల స్టాళ్ల నిర్మాణం

మున్సిపాలిటీ తరఫున ఇప్పటికే మూసివేతకు గురైన సింగరేణి వర్క్‌షాప్, స్టోర్స్ ముందు ప్రధాన రహదారి పక్కన, కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద స్టాల్‌ల నిర్మాణం జరిగింది. వాటిని చిరు వ్యాపారులు అద్దెకు తీసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రెండువైపులా స్టాళ్లు ఉండగా ఒకవైపు ఉన్న వాటిని మాత్రమే అద్దెకు తీసుకున్నారు. రామకృష్ణ థియేటర్ పక్కన నిర్మించిన స్టాళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కాగా స్టాళ్లలో కాకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద కొంతమంది కూరగాయలు అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం. స్టాళ్ల ద్వారా మున్సిపాలిటీకి స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నా సరిగా శ్రద్ధపెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సముచిత నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి అమ్ముతున్న యువకుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. సోమవారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం... కన్నాల బస్తీ వద్ద కొందరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, పోలీసు సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల్లో ఎండీ.తాజ్‌బాబా(హన్మాన్ బస్తీ–బెల్లంపల్లి), షేక్ ఇర్ఫాన్ బాబా (షంషీర్ నగర్–బెల్లంపల్లి), వాసాల గిల్‌క్రిస్ట్(రాజీవ్‌నగర్–తాండూర్), మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి వలస వచ్చిన సంతోష్ సామ్రాడ్ జాదవ్ (కాల్‌టెక్స్ ఏరియా) ఉన్నారు. వీరి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా గంజాయి, తాగుడుకు బానిసగా మారి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

రూ.26.25లక్షలు పలికిన తైబజార్


వేలం నిర్వహిస్తున్న కమిషనర్ రాజు

కైలాస్‌నగర్: పట్టణ తైబజార్ వేలం ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరింది. పట్టణానికి చెందిన మీర్జా అమ్రీన్‌బేగ్, సయ్యద్ ఇస్రార్, కళ్ల సాయికృష్ణలు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ సీవీఎన్.రాజు అధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఇస్రార్ గైర్హాజరు కాగా మిగతా ఇద్దరు హాజరయ్యారు. ఇందులో అధికంగా రూ.26.25 లక్షలకు మీర్జా అమ్రీన్‌బేగ్ తైబజార్‌ను దక్కించుకున్నారు. గతేడాది రూ.20.69 లక్షలకు వేలం వేయగా, ఈసారి బల్దియాకు రూ.5.56లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. సదరు వ్యక్తికి ఏడాదిపాటు తైబజార్ నిర్వహించుకునే అవకాశముంటుంది. బల్దియా ఉద్యోగులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఎంపికపై ఫిర్యాదు

- ఒకే కేంద్రంలో 61 మంది ఎంపికపై విచారణకు తల్లిదండ్రుల వినతి


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: భైంసా పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కేంద్రంలో 61 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంపై విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లి దండ్రులు, నాయకులు కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సోమవారం ఫిర్యాదు చేశారు. గతేడాది నవంబర్ 24న జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష జరిగిందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన ప్రొవిజినల్ లిస్టులో అధికారులు 68 మంది పేర్లు ప్రకటించగా, అందులో భైంసా కేంద్రానికి చెందిన వారే 61 మంది ఎంపిక కావడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విచారణ చేసి మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో పుప్పాల గజేందర్, విద్యార్థుల తల్లి దండ్రులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



ఫ్లెక్సీలు విడుదల చేస్తున్న ఎస్పీ, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డితో సోమవారం ట్రాఫిక్ అవగాహనతో కూడిన ఫ్లెక్సీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. పట్టణంలో సీసీ కెమెరాల ద్వారా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు పోతారం శ్రీనివాస్, సీహెచ్.నాగేందర్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో భార్యాభర్తలకు జైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ దుకాణంలో దొంగతనానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలు శిక్ష పడింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పోస్టాఫీసు బస్తీకి చెందిన అజయ్‌కుమార్ సహానికి బజారు ఏరియా ప్రాంతంలో బట్టల దుకాణం ఉంది. 2022 నవంబర్ 6న రాత్రి దుకాణంలో చోరీ జరిగింది. 250 గ్రాముల బంగారు బిస్కెట్లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.5000 నగదు దొంగిలించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్‌వో ఎం.రాజు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. బెల్లంపల్లి హన్మాన్‌బస్తీకి చెందిన భార్యాభర్తలు ఎండీ.బద్రుద్దీన్, అస్పియా సీరిస్‌పై కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.అజయ్‌కుమార్ ప్రవేశపెట్టగా జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జే.ముకేష్ విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఆరు నెలల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

దాడికేసులో ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: దాడి కేసులో ముగ్గురిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురు కార్మికులపై ఈనెల 9న కొందరు దాడిచేశారు. కార్మికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి భగత్‌సింగ్ కాలనీకి చెందిన అడ్లూరి రాజు, సమీర్, అర్బాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ


హనుమాన్ ఆలయంలో పగులగొట్టి ఉన్న తాళం

బోథ్: మండలంలోని పెద్దార్లగుట్టలో హనుమాన్ ఆలయం, వాగు వద్ద గల అయ్యప్ప సన్నిధానంలో చోరీ జరిగింది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం స్థానికుడు.. అయ్యప్ప సన్నిధానానికి వెళ్లగా తలుపుల తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా ఉంది. అలాగే హనుమాన్ ఆలయం తాళం పగులగొట్టి ఉండడాన్ని భక్తుడు గమనించాడు. హుండీని పగులగొట్టి ఉండడంతో స్థానికులకు సమాచారం అందించాడు. అందులో నగదు ఎత్తుకెళ్లారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని పట్నాపూర్‌కు చెందిన మడావి కార్తీక్ చోరీ చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఐదు గంటల్లోనే దొంగను పట్టుకున్న ఎస్సై, పోలీసు సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ద్వారకానగర్‌లో ఆదివారం రాత్రి బైక్ చోరీకి గురైంది. నేరడిగొండ మండలంలోని వాగ్దారికి చెందిన సోయం వెంకటేశ్ ఆదిలాబాద్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేసిన ఆయన ఉదయం చూసే సరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కలా గాలించినా కనిపించలేదు. సోమవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

మహారాష్ట్ర వ్యక్తి మంచిర్యాలలో అరెస్ట్

మంచిర్యాలక్రైం: మహారాష్ట్ర పోలీసులు మంచిర్యాలలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన కలకలం రేపింది. అరెస్ట్ అయింది ఎవరు..? ఎందుకు అరెస్ట్ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా.. మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని కోలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లింది వాస్తవమేనని పేర్కొన్నారు. మహారాష్ట్ర పోలీసులను సంప్రదించగా.. మహారాష్ట్రలోని కోలాపూర్ ప్రాంతానికి చెందిన ప్రసాద్ పురస్కార్(ఓ నేషనల్ చానల్ రిపోర్టర్) ఛత్రపతి శివాజీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో అల్లర్లు చెలరేగాయని తెలిపారు. ఈ మేరకు ప్రసాద్‌పై కోలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. ప్రసాద్ కోసం గాలిస్తుండగా తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలలో తలదాచుకున్నాడని సాంకేతికత ఆధారంగా గుర్తించి సోమవారం అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు తెలిపారు.

స్వర్ణకారులకు గడ్డు కాలం

- ఆర్నెళ్లుగా పసిడి ధరలు పైపైకి
- నగల తయారీపై ప్రభావం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


పనులు లేక ఖాళీగా కూర్చున్న స్వర్ణకారులు

పాతమంచిర్యాల: పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతున్నాయి. ఆర్నెళ్లుగా బంగారం ధరలు పెరుగుతుండడంతో ఆ ప్రభావం నగల తయారీపై పడుతోంది. దీంతో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న స్వర్ణకారులు, బంగారు ఆభరణాల తయారీదారులు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. బంగారం ధర నిలకడగా ఉండకపోవడంతో కొనుగోలు దారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో చిన్నచిన్న ఆభరణాలు తయారు చేసేవారికి పని లేకుండా పోతోంది. పెరుగుతున్న బంగారం ధర ఒక కారణమైతే కార్పొరేట్ సంస్థలు తయారు చేసే ఆభరణాలు కొనుగోళ్లు కాగా బెంగాల్ నుంచి వచ్చిన కొందరు నగల తయారీదారులు తక్కువ రేట్ల కే నగలు తయారు చేయడం మరో కారణంగా స్వర్ణకారులు పేర్కొంటున్నారు. కాగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న స్వర్ణకారులకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

పెరుగుతున్న బంగారం ధరలు

గతేడాది నవంబర్‌లో బంగారం 10 గ్రాములకు రూ.78 నుంచి రూ.79 వేలకు మధ్యలో ఉంది. డిసెంబర్ నుంచి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం రూ.90,900 ధర పలుకుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో కూడా నగల తయారీ కోసం అంతగా ఆర్డర్లు రాలేదని, తాళిబొట్టు, పుస్తెమెట్టెల తయారీకి కూడా ఆర్డర్లు దొరకడంలేదని వాపోతున్నారు. వాటి తయారీకి కూడా ఆర్డర్లు రావడంలేదని, అవి కొనుగోలు చేసేందుకు పెద్ద పెద్ద దుకాణాలకే వెళ్తున్నారని స్వర్ణకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను బీసీ కార్పొరేషన్‌లో కాకుండా స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు అందిస్తే కొంత చేయూత అందించినట్లవుతుందని స్వర్ణకార సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

స్వర్ణకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు అందించాలి. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి బంగారు నగల తయారీ చేస్తూ మాకు పనులు లేకుండా చేస్తున్న వారిని కట్టడి చేయాలి.
– ధర్మవరం బ్రహ్మయ్య, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల

ధరల పెరుగుదల నియంత్రించాలి



బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతుండంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. పెళ్లిళ్లు, శుభకార్యాలకు బంగారం కొనాలంటే ప్రజలు ఆలోచన చేస్తున్నారు. నగలు తయారు చేయించుకునేందుకు మొగ్గు చూపడంలేదు. బంగారం ధరలు తగ్గితే సామాన్యులకు కొంత ఊరట కలుగుతుంది.
– ఎర్రోజు వేణుగోపాలాచారి, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పనుల్లేక ఖాళీగా ఉంటున్నాం



పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే ఆభరణాల తయారీలో బిజీగా ఉండే వాళ్లం. కానీ ప్రస్తుతం పనులు లేక ఖాళీగా ఉంటున్నాం. ధరలు పెరగడంతో బంగారం కొనుగోళ్లు తక్కువయ్యాయి. దీంతో పనులు లేక షాపులకు అద్దె చెల్లించలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఆదుకుంటేనే స్వర్ణకార వృత్తిదారులకు మనుగడ.
– రమేశ్, స్వర్ణకారుల సంఘం జిల్లా నాయకులు, మంచిర్యాల

బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు విరాళం


విరాళం ప్రకటిస్తున్న ముఖరా కే గ్రామస్తులు

ఇచ్చోడ: వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవ సభకు ముఖరా కే గ్రామస్తులు సోమవారం రూ.1,02,003 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేశారని తెలిపారు. అందుకని 25ఏళ్ల పార్టీ ఆవిర్భవ సభకు గ్రామస్తులంతా కలిసి ఖర్చుల కోసం విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విరాళం చెక్కును అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు మానుకోవాలి

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్(చెన్నూర్): అధికారులు కార్మికులపై వేధింపులు మానుకోవాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిని సెంట్రల్ కమిటీ సభ్యులు తిప్పారపు సారయ్యతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బెదిరింపు లెటర్లు, చార్జ్‌షీట్లు ఇస్తూ కొంతమంది అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, వేతనంలో కోత విధిస్తున్నారని, సమస్యల మీద ప్రశ్నించిన వారిని టార్గెట్ చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్మికులు తెలపగా అధికారులపై మండిపడ్డారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారించడంతో పాటు రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు అశోక్, కొమురయ్య, సాయికుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో 'త్రినయన'


విద్యార్థులతో ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ట్రిపుల్ ఐటీలో త్రినయన సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో జానపదాల పాటలు, నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచయి. కళలు, సంగీతం, నృత్యం మాత్రమే కాకుండా, ఫ్యాషన్ ప్రదర్శన 'ఫ్యాషన్ ఫ్రెంజీ' ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ 'త్రినయన' పేరిట జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు తమలోని కళా నైపుణ్యం ప్రదర్శించారన్నారు. ఈ ఉత్సవం విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏఓ రణధీర్‌సాగి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కన్వీనర్లు డాక్టర్ రాములు, డాక్టర్ అజయ్, ప్రభాకర్‌రావు అసోసియేటెడ్, డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు

వైద్య విద్యార్థుల జోష్


మెమెంటోలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సులేమాన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఫెస్ట్ 2.0లో వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరిస్తున్నాయి. వైద్య విద్యలో నిత్యం బిజీగా ఉండే విద్యార్థులు ఈ నెల 27నుంచి కళాశాలలో క్రీడలు నిర్వహించగా, 21నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఫెస్ట్‌లో ప్రదర్శించి ఆకట్టుకుంటున్నారు. 300మంది ఎంబీబీఎస్ విద్యార్థులు వారం రోజులపాటు నిర్వహించే ఫెస్ట్‌కు కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.సులేమాన్, ప్రొఫెసర్లు ప్రోత్సహిస్తూ, వారికి మెమెంటోలు అందజేస్తున్నారు.